క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు నేతల సత్కారం



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర కమిటీల నాయకులు

నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ **రాష్ట్ర కమిటీలో** నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం **లభించిన** వివిధ విభాగాల పార్టీ ప్రతినిధులు **మాజీ** ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను కలిసారు. ఈ సందర్భంగా గణేష్‌కు శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. గణేష్‌ను కలిసిన వారిలో పార్టీ స్టేట్ మున్సిపల్ విభాగం జాయింట్ సెక్రటరీలు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, రాష్ట్ర మేధావుల విభాగం జాయింట్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, రాష్ట్ర వలంటీర్స్ విభాగం జాయింట్ సెక్రటరీ భీమిరెడ్డి గోవింద్, రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం సెక్రటరీ ఈరెల్లి సుధీర్ కుమార్ ఉన్నారు. పార్టీని అధికారంలోకి తెచ్చుకుని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకునేందుకు కష్టపడి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ వారికి సూచించారు.

ములకలాపల్లిలో 22 మంది రక్తదానం



ములకలాపల్లిలో రక్తదానం చేస్తున్న గ్రామస్తులు

దేవరాపల్లి : ములకలాపల్లిలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, గొర్లె రామ కొండలరావు, పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ చామంతుల సన్యాసిరావు, యూత్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. వాలంటరీ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో కేజీహెచ్ వైద్య సిబ్బంది బ్లడ్‌ను సేకరించారు. అనంతరం దాతలకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు.

రోడ్లు గోతులమయం



గోతులమయంగా సత్యవరం రోడ్డు

మాడుగుల: మండలంలో కేజేపురం, ఘాట్ రోడ్, ఎం.కోడూరు, సత్యవరం, శ్రీరామపురం, కొత్తవలస, రాజంపేట, తదితర గ్రామాలు రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. దీంతో వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరిపోవడం వల్ల వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో వెళ్లాలంటే నరక యాతన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులు బాగు చేయాలని పలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

కేజేపురంలో భారీ వర్షం



కె.జె.పురంలో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న ఎండ వేడిమికి ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. మండలంలో పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం ఎండుతున్న వరినాట్లకు ఊపిరినిచ్చింది. కె.జె.పురం, ఎం.కోటపాడు, ఘాట్‌రోడ్డు తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

బేస్‌బాల్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

మాకవరపాలెం: ఉన్నత పాఠశాల విద్యార్థులు బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపారు. పరవాడలో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో బేస్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఐదుగురు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. భీమిలిలో జరిగిన పోటీల్లోనూ ఆరుగురు విద్యార్థులు ఈ పాఠశాల నుంచి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు డి.రవి, చంద్రదేవితో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు గాలికి..



నర్సీపట్నం బంకులో అలంకారప్రాయంగా ఉన్న గాలి నింపే యంత్రం


- రీడింగ్‌లో మోసాలు
- తనిఖీలు నామమాత్రం

నర్సీపట్నం : నియోజకవర్గంలో చాలా పెట్రోలు బంకుల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. బంకు తెరిచిన తర్వాత యంత్రాల్లో గాలి తీసిన తర్వాతే పెట్రోలు కొట్టాల్సి ఉంది. ఈ నిబంధన బంకుల్లో అమలు కావడం లేదు. ఉదయాన్నే ఉరుకులు పరుగుల మీద బయటకు వెళ్లే సమయంలో బంకుల్లో పెట్రోలు కొట్టించుకునేవారు మోసపోతున్నారు. ఫలితంగా 40 శాతం గాలి, 60 శాతం పెట్రోలు మాత్రమే ఉంటోందన్న ఆరోపణలున్నాయి. బంకుల యజమానులు తీరిగ్గా ఉదయం ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో గాలి తీస్తున్నారు. ఆలోగా వందలాది లీటర్ల పెట్రోలు, డీజిల్ అమ్మకాలు జరిగిపోతున్నాయి. చాలా పెట్రోలు బంకుల్లో ఇంధనం నింపేటప్పుడు రీడింగ్ 1 నుంచి కాకుండా 5,6,10 పాయింట్ల నుంచి ప్రారంభమవుతుంది. ఇదేమని వినియోగదారులు అడిగితే గాలి వేగంగా వెళ్లడంతో పాయింట్లు తొందరగా పడ్డాయంటూ సమాధానం ఇస్తున్నారు. వారి కారణంగా వాహనదారులు నష్టపోతున్నారు.

నియోజకవర్గంలో అన్నిరకాల వాహనాలు లక్షల్లో ఉన్నాయి. బంకులు వందకు పైగా ఉన్నాయి. ప్రతి రోజూ సుమారు పెట్రోలు, డీజిల్ సుమారు 6 లక్షల లీటర్ల వరకు వినియోగిస్తున్నారు. పెట్రోలు బంకుల్లో అక్రమాలు జరుగుతున్నా పౌరసరఫరాలు, తూనికలు–కొలతలు, విజిలెన్స్ అధికారుల తనిఖీలు నామమాత్రంగా ఉంటున్నాయి. అప్పుడప్పుడు తనిఖీ చేస్తూ కేవలం జరిమానా వసూలు చేస్తున్నారు తప్ప మోసాలకు అడ్డుకట్ట వేయడం లేదు.

పెట్రోలు బంకుల్లో కేవలం పెట్రోలు, డీజిల్ విక్రయించడమేకాక వినియోగదారులకు వివిధ రకాల సేవలందించాలి. తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స, గాలి నింపే యంత్రం అందుబాటులో ఉండాలి. చాలా బంకుల్లో ఇవేవీ ఉండడం లేదు. 80 శాతానికిపైగా బంకుల్లో గాలి యంత్రాలు ఉన్నప్పటికీ వాహనాల టైర్లకు గాలి నింపడం లేదు. కొన్నిచోట్ల గాలి నింపేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారు.

పెట్రోలు, డీజిల్ నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు కల్తీని గుర్తించేందుకు ప్రతి పెట్రోలు బంకులో బాట్లింగ్ పేపర్ అందుబాటులో ఉంచాలి. చాలా బంకుల్లో ఇది కానరావడం లేదు నిబంధనల ప్రకారం వినియోగదారుడు అడిగితే బాట్లింగ్ పేపర్‌పై పెట్రోలు పోసి చూపాల్సిన బాధ్యత బంకు నిర్వాహకులకు ఉంది.



బలిఘట్టం శివారు బంకులో పని చేయని గాలి నింపే యంత్రం

బొత్సను కలిసిన పోతల



వైఎస్సార్‌సీపీ నేతలు కన్నబాబు రాజు, బొడ్డేడ ప్రసాద్‌లతో కలిసి బొత్స సత్యనారాయణను కలిసిన పార్టీ బీసీ సెల్ ప్రత్యేక అధికార ప్రతినిధి పోతల లక్ష్మీ శ్రీనివాస్

రోలుగుంట: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియమితులైన రోలుగుంట మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శ్రీనివాస్ ఆదివారం శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణను విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నాయకులు కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి కన్నబాబు రాజులను కలిశారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన ఈ పదవికి గుర్తింపు తెచ్చే భాగంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అందుకు ఉమ్మడి జిల్లా నాయకుల సూచనలతో మండల నాయకులు, కార్యకర్తల సహకారం తీసుకుంటానన్నారు.

24న చలో విశాఖ డెయిరీ



ఆనందపురంలో గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకుడు నాయినిబాబు

కె.కోటపాడు : ఈ నెల 24న విశాఖ డెయిరీ సర్వసభ్య సమావేశం వద్దకు పాడి రైతులంతా చలో విశాఖ డెయిరీ కార్యక్రమం పేరిట పెద్ద సంఖ్యలో హాజరై పాడి రైతుల కష్టాలను తెలియజేయాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. ఆనందపురం గ్రామంలో ఆదివారం చలో విశాఖ డెయిరీ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయినిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విశాఖ డెయిరీపై హౌస్ కమిటీని నియమించిందని, ఈ కమిటీ నిజాలను వెలికితీసి దోషులను శిక్షించాలని ఆయన కోరారు. రైతుల పాలకు చెల్లిస్తున్న ధరకు అదనంగా లీటర్‌కు రూ.10లను పెంచేలా డెయిరీ చర్యలను చేపట్టాలని, మరణించిన రైతుకు ఆర్థిక సహాయం, ప్రతి మూడు నెలలకు ఒకసారి బోనస్ నగదును రైతులకు ఇవ్వాలని నాయినిబాబు కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ



ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పాదాలు దర్శించుకుంటున్న భక్తులు



ఎం. కోడూరు మోదమాంబను దర్శించుకున్న భక్తులు

రావికమతం: దొండపూడిలో మోదకొండమ్మ అమ్మవారి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దొండపూడి చెక్‌పోస్టు దగ్గర గల సోమునాయుడు పాకల వద్ద కొలువు దీరిన మోదకొండమ్మ అమ్మవారి పండగను ప్రతి ఏటా వరినాట్లు వేసిన తరువాత చేయడం ఆనవాయితీ. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి గుడి వద్ద అన్న సమారాధన జరిపారు. కొత్తకోట, మత్స్యవానిపాలెం, కిత్తంపేట, టి.అర్జాపురం గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి దర్శించుకొని అన్న సమరాధనలో పాల్గొన్నారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబకు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలో సాగరం, ఘాట్‌రోడ్డు, కె.జె.పురం, గ్రామాల్లో మోదమాంబకు పూజలు జరిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మను ఆదివారం ఆభరణాలతో పాటు ప్రత్యేక పట్టు చీర,వెండికవచం పుష్పాలుతో అలంకరించారు. దసరా నవరాత్రి ఉత్సవాలకు ముందు మోదకొండమ్మను ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారు 150 మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ముస్తాబవుతున్న ఆలయాలు
- మాడుగులలో ఏర్పాట్లు సిద్ధం
- చలువ పందిళ్లు, ఆలయ గోపురానికి రంగులు

మాడుగుల: అలనాటి మహరాజులు సంప్రదాయాలతో మాడుగులలో దసరా ఉత్సవాలు సోమవారం నుంచి సివిల్ ఆర్‌టీసీ ఆటోమోటారు ఓనర్స్, వర్కర్స్ యూనియన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు జరగనున్నాయి. ఆదివారం దేవీ ఆలయ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని కమిటీ సభ్యులు మాట్లాడారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ 10 గంటలకు దేవరాపల్లి శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులతో తొలిపూజ ప్రారంభం కానుందన్నారు. వచ్చే నెల 2వ తేదీ ముగింపు వరకు ప్రతిరోజు సాయంకాలం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల ముగింపు రోజున కోటబయట మోదకొండమ్మ సతకం పట్టు వద్ద సినీ ప్రైమ్ జానకీ రామ్, మా టీవీ విజేత, యువకెరటం వారి నృత్య ప్రదర్శన ఉంటాయి. ఉత్సవాలు విజయవంతానికి భక్తులు పోలీసులకు, కమిటీ వారికి సహకరించాలని కమిటీ కోరింది. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, అధ్యక్షుడు ఎస్.వి.కొండలరావు, కార్యదర్శి అన్నం నీడి ప్రసాదరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సుందర రాజు, పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక పాత రామ మందిరం వద్ద నేతాజీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి దుర్గమ్మ నవరాత్రోత్సవాలను నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి పీఠం ఏర్పాటు కోసం టెంటు వేశారు. మామిడి తోరణాలు, అరటి గెలలతో అలంకరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రచారకార్యదర్శి పిల్లి శ్రీను, సభ్యులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని అన్ని అవతారాలతో పూజలు చేయడం జరుగుతుందన్నారు. మాలధారులతో భజనలు ఉంటాయన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.



నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు తదితరులు



విశేష అలంకరణలో లలితాదేవి

చీడికాడ: అప్పలరాజుపురం దేవి మెట్టపై వెలసిన లలితా దేవి ఆలయంలో దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నట్టు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి అంకురార్పణ పూజలతో దసరా మహోత్సవాలు దసరా వరకు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శన మిస్తారన్నారు.

చోడవరం : దసరా నవరాత్రి ఉత్సవాలకు దుర్గాదేవి ఆలయాలు ముస్తాబ య్యాయి. ఈనెల 22వ తేదీన ఉదయం నుంచి ఆలయాల్లో నవరాత్రి పూజలు ప్రారంభం కానున్నాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా ఈ ఏడాది వెంకన్నపాలెం కొండపై వెలసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఏక శిలా విగ్రహం కలిగిన దుర్గమ్మతల్లి ఆలయాలు కేవలం రెండు మూడు మాత్రమే ఉండగా అందులో వెంకన్నపాలెం కొండపై కనకదుర్గమ్మ ఆలయం ఒకటి. సుమారు 30 ఏళ్ల కిందట ఈ ఆలయాలు శ్రీ రాఘవేంద్రస్వామీజీ గురువు ఈ ఆలయాన్ని కొండపై నిర్మించారు. సుమారు కిలోమీటరు ఎత్తయిన కొండపై రోడ్డు మార్గం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఈ కొండపై దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ఆలయాన్ని రంగురంగులతో సర్వాంగ సుందరంగా తయారు చేశారు. చోడవరం పాతబస్టాండ్ దగ్గర శ్రీ దుర్గాదేవి ఆలయంలోను దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు చేసేందుకు ఏర్పాటు చేశారు.



రోలుగుంటలో దుర్గమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న నేతాజీ సంఘం సభ్యులు



కొండపై ఆలయంలో కొలువైన కనకదుర్గ అమ్మవారు

మహాకవి గురజాడకు నివాళి




గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ దమయంతి, ఉపాధ్యాయులు, పాఠకులు

నర్సీపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి, పాఠకులు రామచంద్రరావు, కోటవురట్ల జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ గురజాడ వారు మన తెలుగువాడు కావడం గర్వకారణం అన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటిక ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటిన తెలుగు వైతాళికుడు కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో అమృతకుమార్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

నేటి నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు

మాడుగుల రూరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని, కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి అమ్మవారికి అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ విజయదశమి వరకు ఆలయంలో ఈ పూజలు జరుతాయని తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులకు 11 రోజుల పాటు జరిగే అన్నసమారాధన కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు. అదేవిధంగా కె.జె.పురం కళావేదిక మీద దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం అమ్మవారి విగ్రహం కళావేదికపై కొలువు ఉంచనున్నారు. 11 రోజులు పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక శివాలయంలో పార్వతిదేవికి సోమవారం నుంచి విజయ దశమి వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు హేమాదిభట్ల సత్యనారాయణమూర్తి ఆదివారం తెలిపారు.

జీవామృతంతో చీడపీడల నివారణ



జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాలలో రైతులకు జీవామృతం తయారీ విధానంపై ప్రకృతి వ్యవసాయం జిల్లా మార్కెటింగ్ మాస్టర్ శిరసపల్లి అప్పరాజు అవగాహన కల్పించారు. ఆదివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవామృతం తయారీ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి 15 రోజులు ఒకసారి నీటితో జీవామృతాన్ని పిచికారీ చేయడంతో పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఎటువంటి చీడపీడలు దరి చేరవని, పంట దిగుబడి బాగుంటుందన్నారు. పకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మజ్జి సత్యారావు, మల్ల నాగేశ్వరరావు, ఐసీఆర్పీలు సంతోష్, సాయి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్

అనకాపల్లి: మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ సాలాపు శాంతి సూరిఅప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ అప్‌డేట్, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు మరోసారి అప్‌డేట్ చేయించాలన్నారు.

నేడు 126 అడుగుల వినాయకుడికి నిమజ్జనం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల లక్ష్మీగణపతి నిమజ్జనోత్సవం సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు బుద్ధ భూలోక నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వారాడలో వినాయక విగ్రహం అనుపోత్సవం



వారాడలో వినాయక విగ్రహం ఊరేగింపు

కె.కోటపాడు : వారాడలో శ్రీ వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వినాయక విగ్రహం అనుపు మహోత్సవం జరిపారు. అంతకుముందు వినాయకునికి పూజలు జరిపి మహిళల కోలాటాలతో ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో శ్రీ వినాయక యూత్ కమిటీ సభ్యులు గిడుతూరి అప్పారావు, దొగ్గ నాగరాజు, రాజు, మహేష్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు, పాడి గేదె మృతి



మృతి చెందిన ఆవు, పాడి గేదె

గొలుగొండ: మండలంలో శ్రీరాంపురం గ్రామానికి చెందిన రాయపురెడ్డి మల్లిబాబుకు పాడి గేదె, ఆవు ఆదివారం పిడుగుపాటుకు మృతి చెందాయి. వాటిని ఇంటి పాక వద్ద ఆదివారం మధ్యాహ్నం కట్టివేయగా, మధ్యాహ్న సమయంలో పిడుగులతో పాటు భారీ వర్షం కురవడంతో పిడుగుపాటుకు రెండూ అక్కడికక్కడే మృతి చెందాయి. తన జీవనాధారమైన ఆయిన పాడి పశువులు మృతి చెందడంతో మల్లిబాబు కుటుంబం కన్నీరుమున్నీరు అయ్యారు. సుమారుగా రెండు లక్షల మేర నష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని కోరారు.

పీఏసీఎస్ సేవలు రైతులందరికీ అందేలా కృషి

రోలుగుంట: రైతులకు మేలు చేసే విధంగా పీఏసీఎస్ ద్వారా సంపూర్ణ సేవలందేలా కృషి చేస్తానని జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు, జానకీరాంపురం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అయిన బలిజి మహరాజు అన్నారు. ఆదివారం పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన బలిజి మహరాజు, డైరెక్టర్లు పరవాడ రాజారావు, గొర్లి శ్రీరామ్మూర్తి శుభ ఘడియలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు సంఘ అభివృద్ధి, సభ్యులకు అందించే సేవలు తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, నియోజకవర్గం ఇంచార్జి కందర్ప రమణ, మండల శాఖ అధ్యక్షుడు పచ్చిగోళ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి నాటికల ప్రదర్శన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పార్కుసెంట్ గౌరీ సేవా సంఘంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ వారిచే 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం' పద్య నాటకం, 23న సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారిచే '27వ మైలు రాయి' నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు జిల్లా కైకలూరు సాయి ఆర్ట్స్ వారిచే ' జనరల్ బోగీలు' నాటిక, 24న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన మల్లాది క్రియేషన్స్ వారిచే 'ఆవేశంలో ఆనందం' హాస్య నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు అభినయ్ ఆర్ట్స్ వారిచే 'ఇది అతని సంతకం' నాటిక, 25న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, గోవాడ క్రియేషన్స్ వారిచే 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు వారిచే 'నాన్న' నాటిక, 26న సాయంత్రం 6 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారిచే ' విడాకులు కావాలి' నాటిక, రాత్రి 8 గంటలకు విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్ వారిచే 'భువి కోరని భ్రమణం ' నాటికలు ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. నాటికల పర్యవేక్షకులుగా కె.ఎం.నాయుడు, మళ్ల సూరిబాబు వ్యవహరిస్తారన్నారు.